ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



అనకాపల్లి

జిల్లా వార్తలు

శుక్రవారం 8 మార్చి 2024

పరుగో పరుగు



పిసినికాడలో గురువారం 'చేయూత' నాలుగో విడత నిధులను బటన్ నొక్కి విడుదల చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి



సీఎం మాట్లాడుతుండగా ప్రాంగణం నుంచి పరదాలు దాటుకుని బయటకు వచ్చేస్తున్న మహిళలు



బస్సులోనే ఉండిపోయిన మహిళలు

'వైఎస్ఆర్ చేయూత' పథకం నాలుగో విడత నిధుల విడుదల కార్యక్రమం గురువారం అనకాపల్లి మండలం పిసినికాడ గ్రామంలో నిర్వహించారు. సభకు రాకపోతే 'చేయూత' నిధులు అందవంటూ స్థానిక వైసీపీ నేతలు, వలంటీర్లు బెదిరించి మరీ లబ్ధిదారులను జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి బస్సులు, ఆటోల్లో పిసినికాడ తరలించారు. అయితే ముఖ్యమంత్రి మాట్లాడడం ప్రారంభించిన ఐదు నిమిషాలకే మహిళలు సభా ప్రాంగణం నుంచి వెనుతిరిగారు.

అమర్‌కు టికెట్ లేనట్టే?

పిసినికాడ సభలో పరోక్షంగా సంకేతాలు ఇచ్చిన సీఎం

- గుండెల్లో పెట్టుకుని చూసుకుంటానని ప్రకటన
- 2019 ఎన్నికల సమయంలో దాడి రత్నాకర్‌కూ అదే హామీ
- కానీ మొండి చెయ్యి



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

అనకాపల్లి ఎమ్మెల్యే, ఐటీ, పరిశ్రమల శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఈ సారి ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం లభించేటట్టు లేదు. ఈ విషయంపై గురువారం అనకాపల్లి మండలం పిసినికాడలో నిర్వహించిన 'చేయూత' సభలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డే స్పష్టత ఇచ్చారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, మంత్రి గుడివాడ అమర్ ఇద్దరూ తనకు తమ్ముళ్లలాంటి వారని, భరత్‌ను ఎమ్మెల్యేగా పోటీకి దింపుతున్నామని, ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మంత్రి అమర్‌ను గుండెల్లో పెట్టుకుంటానని చెప్పుకొచ్చారు. అంటే ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదనే విషయాన్ని పరోక్షంగా స్పష్టంచేశారు.

దాడి వీరభద్రరావు తన తనయుడు రత్నాకర్‌తో కలిసి 2019 ఎన్నికలకు ముందు వైసీపీలో చేరారు. అప్పుడు కూడా జగన్ ఇదే మాట అన్నారు. రత్నాకర్ తన సోదరుడితో సమానమని, గుండెల్లో పెట్టుకుంటానని చెప్పారు. అయితే ఆ ఎన్నికల్లో ఆయనకు ఎక్కడా పోటీ చేసే అవకాశం కల్పించలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సీనియర్ నాయకుడైన వీరభద్రరావుకు గానీ, కుమారుడు రత్నాకర్‌కు గానీ ఎటువంటి పదవి ఇవ్వలేదు. ఈ ఎన్నికల్లో ... మిగతా 7వ పేజీలో

సీఎం వచ్చారు.. వెళ్లారు?

జగన్ పర్యటనతో జిల్లాకు ఒరిగిందేమీ లేదు

- వైసీపీ సభగా మారిన చేయూత నిధులు విడుదల కార్యక్రమం
- జిల్లాలో ప్రధాన సమస్యలు, పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీల ఊసేలేదు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గురువారం చేపట్టిన జిల్లా పర్యటన 'వచ్చారు.. వెళ్లారు..' అన్న చందంగా సాగింది. అనకాపల్లి మండలం పిసినికాడ వద్ద వైఎస్ఆర్ చేయూత నాలుగో విడత నిధుల విడుదల కోసం ఏర్పాటు చేసిన సభను రాజకీయ వేదిగా మార్చేశారు. జిల్లాలో దీర్ఘకాలంగా పరిష్కారానికి నోచుకోని సమస్యల్లో ఒక్కదానిని కూడా సీఎం ప్రస్తావించలేదు. అదే విధంగా గత సాధారణ ఎన్నికల ముందు పాదయాత్ర సందర్భంగా జిల్లా ప్రజలకు ఇచ్చిన హామీల ఊసెత్తలేదు. పైగా అమర్ (మంత్రి), భరత్ (వైసీపీ అనకాపల్లి సమన్వయకర్త) తనకు ఇద్దరూ తమ్ముళ్లేనని, ఎన్నికల్లో భరత్ విజయానికి పార్టీ శ్రేణులు కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారు. చేయూత నిధులు విడుదల కోసం ప్రజాధనం ఖర్చుచేసి ఏర్పాటు చేసిన సభను సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల ప్రచార వేదికగా మార్చేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



మాట్లాడుతున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి

హామీల ఊసెత్తని సీఎం

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు ప్రతిపక్ష నేత హోదాలో జిల్లాలో పాదయాత్ర చేశారు.. ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనేక హామీలు ఇచ్చారు. తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీని ఆధునీకరిస్తామని, మిగిలిన మూడు షుగర్ ఫ్యాక్టరీలను ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. కానీ జగన్ సీఎం అయిన తరువాత తమ్మపాల షుగర్స్ ఆధునికీకరణను అటకెక్కించారు. ఏటికొప్పాక, తాండవ షుగర్ ఫ్యాక్టరీలను మూసివేయించారు. దీంతో వేలాదిమంది చెరకు రైతులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, పోలవరం ఎడమ ప్రధాన కాలువతోపాటు జిల్లాలో మధ్య, చిన్నతరహా ప్రాజెక్టులు, ఆనకట్టలు, గ్రోయిన్ల అభివృద్ధి/ నిర్వహణ పనులకు ఒక్క ఏడాది కూడా నిధులు కేటాయించలేదు. సీఎం తన ప్రసంగంలో ఎక్కడా ఈ విషయాలను ప్రస్తావించలేదు. అయినప్పటికీ మరో సారి ఓట్లేసి గెలిపించాలని ప్రజలను కోరడం ఆయనకే చెల్లిందని విపక్ష నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.

అనకాపల్లి ఎమ్మెల్యే, మంత్రి అయిన గుడివాడ అమర్‌నాథ్.. అనకాపల్లి నియోజకవర్గంలో రూ.1,500 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పుకొచ్చారు. అయితే మూతపడిన తుమ్మపాల షుగర్ ఫ్యాక్టరీ గురించి నోరు విప్పలేదు. పరవాడ ఫార్మాసిటీలో ఔషధ పరిశ్రమల నుంచి విడుదలవుతున్న వ్యర్థ రసాయనాలు సముద్రంలోకి వదులుతుండడం వల్ల మత్స్యసంపద నాశనం అవుతోంది. సమీపంలోని గ్రామాల్లో వున్న చెరువుల్లో వ్యర్థ రసాయనాలు కలవడం వల్ల భూగర్భ జలాలు కలుషితమై ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అచ్యుతాపురం ఎస్ఈజడ్, పరవాడ ఫార్మా ఎస్ఈజడ్, హెటెరో, డోక్సస్ కెమికల్స్ తదితర పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసినప్పటికీ ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. అచ్యుతాపురం మండలం పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మాణ పనులు ఇంతవరకు ప్రారంభించలేదు. కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రులు బూడి ముత్యాలనాయుడు, పీడిక రాజన్నదొర, బొత్స సత్యనారాయణ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేనకు 4

అనకాపల్లి జిల్లాలో మూడు, విశాఖ జిల్లాలో ఒకటి..

- జాబితాలో అనకాపల్లి, ఎలమంచిలి, విశాఖ సౌత్, పెందుర్తి లేదా మాడుగుల
- ఒక స్థానానికి కొణతాల రామకృష్ణ పేరు ఇప్పటికే ప్రకటన
- మిగిలిన మూడుచోట్ల పంచకర్ల రమేశ్‌బాబు, సుందరపు విజయకుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్‌లకు అవకాశం?



కొణతాల రామకృష్ణ



పంచకర్ల రమేశ్‌బాబు



సుందరపు విజయ్‌కుమార్



వంశీకృష్ణ శ్రీనివాస్

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తెలుగుదేశంతో పొత్తు నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లాలో జనసేన పార్టీ పోటీ చేసే స్థానాలపై దాదాపు స్పష్టత వచ్చింది. ఇరు పార్టీల అధినేతల మధ్య తాజాగా జరిగిన చర్చల్లో జనసేనకు నాలుగు అసెంబ్లీ స్థానాలు ఇచ్చేందుకు అంగీకారం కుదిరింది. అనకాపల్లి జిల్లాలో అనకాపల్లి, ఎలమంచిలి, పెందుర్తి లేదా మాడుగుల, విశాఖ జిల్లాలో దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన అభ్యర్థులు పోటీ చేయనున్నారు.

రెండు జిల్లాల్లో 13 అసెంబ్లీ స్థానాలు ఉండగా వాటిలో నాలుగుచోట్ల జనసేన అభ్యర్థులు బరిలో నిలవనున్నారు. అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థిగా ఇప్పటికే కొణతాల రామకృష్ణను ప్రకటించిన విషయం తెలిసిందే. జనసేనలోకి వచ్చిన కొణతాల లోక్‌సభకు పోటీ చేసే అవకాశం ఉందని పలువురు భావించారు. యితే ఊహించని విధంగా పవన్‌కళ్యాణ్ సోదరుడు నాగబాబు రంగంలోకి దిగారు. అనకాపల్లి లోక్‌సభ నియోజకవర్గం మొత్తం తిరిగి, సమావేశాలు నిర్వహించారు. అచ్యుతాపురంలో ఉండడానికి నివాసం కూడా తీసుకున్నారు. ఆయన అనకాపల్లి ఎంపీగా పోటీ చేస్తారనే ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పవన్‌కళ్యాణ్ విశాఖపట్నం పర్యటనకు రావడం, నేరుగా కొణతాల ఇంటికి వెళ్లి గంటన్నర సేపు మంతనాలు జరపడం చర్చనీయాంశంగా మారింది. అప్పుడే ఆయనకు అనకాపల్లి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తామని హామీ ఇచ్చినట్టు తెలిసింది. అదేవిధంగా ఎలమంచిలి నుంచి కూడా జనసేన పోటీ చేయనున్నది. అక్కడ సుందరపు విజయకుమార్ చాలాకాలంగా పార్టీకి పనిచేస్తున్నారు. ఆయనకే పోటీ చేసే అవకాశం లభించవచ్చునని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఆయన సోదరుడు సతీశ్‌కుమార్ కూడా గత మూడు నెలలుగా పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయనకు ఉత్తరాంధ్ర పార్టీ ఇన్‌చార్జి పదవి ఇచ్చారు. గాజువాక నుంచి పోటీకి దించుతారని ప్రచారం జరిగింది. అయితే పొత్తుల్లో భాగంగా గాజువాక సీటును తెలుగుదేశం పార్టీయే ఉంచుకుంటామని స్పష్టం చేసింది. ఇప్పుడు సతీశ్‌కుమార్ పార్టీ కోసమే పనిచేస్తారని అంటున్నారు.

పెందుర్తి లేదా మాడుగుల

అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు విస్తరించి ఉన్న పెందుర్తి సీటును కూడా జనసేనకు ఇవ్వడానికి టీడీపీ అధినేత అంగీకరించినట్టు చెబుతున్నారు. అయితే అక్కడ టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి తనకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం ఆయన కుమారుడు అప్పలనాయుడు, అల్లుడైన శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్‌నాయుడు ప్రత్యేకంగా బుధవారం చంద్రబాబునాయుడును కలిశారు. జనసేనకు పెందుర్తికి బదులుగా మాడుగుల ... మిగతా 7వ పేజీలో

విపక్ష నేతల గృహ నిర్బంధాలు

సీఎం పర్యటనతో పోలీసులు అత్యుత్సాహం

- ప్రతిపక్షాలతోపాటు ప్రజా సంఘాలు, ఉపాధ్యాయ సంఘాల నేతలు హౌస్ అరెస్టు
- ఇళ్ల నుంచి బయటకు వెళ్లవద్దని హుకుం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న నాయకులు
- ప్రశ్నించే వారి గొంతులు నొక్కుతున్నదని ఆగ్రహం



చోడవరం జనసేన కార్యాలయంలో ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజును గృహనిర్బంధం చేసిన సీఐ శ్రీనివాసరావు



నాతవరం మండలం లక్ష్మీపురంలో జనసేన నాయకుడు సూర్యచంద్రను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

అనకాపల్లి టౌన్, మార్చి 7: ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన వుంటే చాలు.. పోలీసులు ఎక్కడికక్కడ ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, ఉద్యోగ/ ఉపాధ్యాయ సంఘాల నేతలను గృహనిర్బంధం చేయడం, అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించడం సర్వసాధారణంగా మారింది. చేయూత పథకం నిధులు విడుదల కోసం ముఖ్యమంత్రి గురువారం జిల్లాలోని పిసినికాడలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్నారు. సీఎం పర్యటనను దృష్టిలో పెట్టుకుని పోలీసులు బుధవారం రాత్రి నుంచి పలువురు నేతలను గృహనిర్బంధం చేశారు. అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్ష్మణరావు ఇంటికి బుధవారం రాత్రి 11 గంటలకు పోలీసులు వచ్చారు. సీఎం పర్యటన నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం వరకు ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని స్పష్టం చేశారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు పాత్రపల్లి వీరుయాదవ్‌ను కూడా హౌస్ అరెస్టు చేశారు.



యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయిని అనకాపల్లి మండలం మామిడిపాలెం స్కూలులో నిర్బంధించిన పోలీసులు

యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి స్కూలులో నిర్బంధం

కశింకోట: అనకాపల్లి మండలం మామిడిపాలెం స్కూలులో విధులకు హాజరైన యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చినబ్బాయిని పోలీసులు పాఠశాలలోనే నిర్బంధించారు. సీపీఎం జిల్లా నాయకుడు దాకారపు శ్రీనివాసరావును కశింకోటలో హౌస్ అరెస్టు చేశారు.

ధర్మవరంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు..

ఎస్.రాయవరం: మండలంలోని ధర్మవరం అగ్రహారంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును గురువారం ఉదయం పోలీసులు గృహ నిర్బంధం చేశారు. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ నిర్వాసితులకు పరిహారం కోసం పోరాడుతున్న తాను సీఎంకు వినతిపత్రం ఇవ్వాలనుకున్నానని, కానీ పోలీసులు గృహనిర్బంధం చేయడం సరికాదని అన్నారు.

చోడవరంలో జనసేన, సీపీఐ నేతలు..

చోడవరం: జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లం రామఅప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు గూనూరు మూలినాయుడులను బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు స్థానిక జనసేన కార్యాలయంలో పోలీసులు నిర్బంధించారు. సీఐ బి.శ్రీనివాసరావు జనసేన కార్యాలయం వద్ద మకాం వేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రెడ్డిపల్లి అప్పలరాజును బుధవారం రాత్రి 11 గంటల నుంచి గురువారం మధ్యాహ్నం వరకు పోలీసులు గృహనిర్బంధం చేశారు.

లక్ష్మీపురంలో జనసేన నేత సూర్యచంద్ర...

నాతవరం : నర్సీపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి రాజాన వీరసూర్యచంద్రను పోలీసులు బుధవారం అర్ధరాత్రి నుంచి లక్ష్మీపురంలో హౌస్‌అరెస్టు చేశారు. ప్రశ్నించే గొంతులను నొక్కడమే వైసీపీ ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందని ఆయన ఆరోపించారు.

పంచాయతీరాజ్ చాంబర్ జిల్లా అధ్యక్షుడు..

కె.కోటపాడు: ఉమ్మడి విశాఖ జిల్లా పంచాయతీరాజ్ చాంబర్ అధ్యక్షుడు దాడి ఎరుకునాయుడును పోలీసులు గృహనిర్బంధం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వం పోలీసులను అడ్డంపెట్టుకుని ప్రజల గొంతు నొక్కుతున్నదని, రాజ్యాంగం కల్పించిన వాక్ స్వాతంత్ర్యాన్ని హరించివేస్తున్నదని, ఈ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారని అన్నారు.

పోలీసు స్టేషన్‌లో సీపీఎం నేతలు

దేవరాపల్లి: సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న, అఖిల భారత యువజన సమాఖ్య అధ్యక్షుడు వేమల కన్నబాబులను గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ప్రజా సంఘాల గొంతు నొక్కడం ప్రభుత్వానికి తగదని సీపీఎం మండల నాయకుడు బి.టిదొర అన్నారు.

ట్రాఫిక్ పద్మవ్యూహం!

సీఎం పర్యటనతో వాహనాలను దారి మళ్లించిన పోలీసులు

- ఎలమంచిలి నుంచి లంకెలపాలెం వరకు హైవే బంద్
- రేగుపాలెం జంక్షన్, అచ్యుతాపురంలో భారీగా స్తంభించిన ట్రాఫిక్
- గంటల తరబడి నిలిచిపోవడంతో ఎండ, ఉక్కపోతతో ప్రయాణికులు ఇక్కట్లు



పోతిరెడ్డిపాలెం వద్ద అడ్డదిడ్డంగా ఆపేసిన వాహనాలు

అనకాపల్లి టౌన్/ ఎలమంచిలి/ అచ్యుతాపురం, మార్చి 7:

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా పోలీసులు విధించిన ట్రాఫిక్ ఆంక్షలు, వాహనాల మళ్లింపుతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనకాపల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలి, రేగుపాలెం జంక్షన్‌లో గంటల తరబడి వాహనాలు నిలిపోయాయి. మిట్టమధ్యాహ్నం కావడంతో ఎండవేడి, ఉక్కపోతతో అల్లాడిపోయారు. పోలీసులు సీఎం సభ బందోబస్తులో వుండడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టేవారు లేకపోయారు. మరోవైపు సీఎం సభకు ప్రజలను తరలించడానికి ఆర్టీసీ బస్సులను వినియోగించడంతో సాధారణ ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.



సీఎం సభ కారణంగా జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సుల కోసం వేచివున్న ప్రయాణికులు

ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా చేయూత పథకం నాలుగో విడత నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని అధికారులు గురువారం అనకాపల్లి మండలం పిసినికాడలో ఏర్పాటు చేశారు. బహిరంగ సభ నిర్వహించే ప్రదేశం జాతీయ రహదారి పక్కన వుండడంతో తుని వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే వాహనాలను రేగుపాలెం జంక్షన్, ఎలమంచిలి, అచ్యుతాపురం, పరవాడ మీదుగా లంకెలపాలెం వద్ద జాతీయ రహదారికి చేరేలా మళ్లించారు. అదే విధంగా విశాఖ వైపు నుంచి తుని వైపు వెళ్లే వాహనాలను కూడా ఇదే మార్గంలోకి మళ్లించారు. దీంతో లంకెలపాలెం, అచ్యుతాపురం జంక్షన్, రేగుపాలెం జంక్షన్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. సాధారణ రోజుల్లోనే అచ్యుతాపురం జంక్షన్ వాహనాలతో రద్దీగా వుంటుంది. సెజ్‌లోని కర్మాగారాల్లో విధులకు హాజరయ్యే కార్మికులు, ఉద్యోగులను తీసుకువచ్చే వందలాది బస్సులు జంక్షన్ మీదుగా వచ్చిపోతుంటాయి. ఇంకా యంత్ర సామగ్రితో భారీ వాహనాలు వస్తుంటాయి. దీనికి తోడు గురువారం అనకాపల్లి హైవే మీదుగా మీదుగా వెళ్లాల్సిన వాహనాలను అచ్యుతాపురం మీదుగా మళ్లించడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. అచ్యుతాపురం కూడలిలో ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి.

హైవేపై 4 కి.మీ.ల మేర నిలిచిన వాహనాలు

తునివైపు నుంచి వచ్చే వాహనాలను ఎలమంచిలి పోలీసులు రేగుపాలెం జంక్షన్ నుంచి అచ్యుతాపురం రోడ్డులోకి మళ్లించేలా చర్యలు చేపట్టారు. అయితే ఈ మార్గంలో వెళితే ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందన్న ఉద్దేశంతో పలువురు లారీ డ్రైవర్లు వాహనాలను రోడ్డుపైనే ఆపేశారు. దీంతో రేగుపాలెం జంక్షన్ నుంచి పోతిరెడ్డి పాలెం జంక్షన్ వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది.

ఇదిలావుండగా సీఎం సభకు వివిధ ప్రాంతాలను ప్రజలను తీసుకువచ్చిన వాహనాలను అనకాపల్లి సమీపంలోని కొత్తూరు జంక్షన్ నుంచి పిసినికాడ వరకు రోడ్డుకు ఇరువైపులా నిలుపుదల చేయడంతో ఆటోలు, కార్లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దూరప్రాంతాలకు ప్రయాణించే వారు ఇబ్బంది పడ్డారు. కొత్తూరు జంక్షన్ నుంచి పిసినికాడ దాటడానికి సుమారు అరగంట సమయం పట్టింది.

సీఎం సభకు ఆర్టీసీ బస్సులు.. ప్రయాణికుల పాట్లు!

ముఖ్యమంత్రి సభకు ప్రజలను తరలించడానికి ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో అనకాపల్లి నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అనకాపల్లి డిపోలో వంద బస్సులు వుండగా, వీటిలో 23 బస్సులను సభకు పంపారు. దీంతో విశాఖపట్నం, విజయనగరం, దేవరాపల్లి, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట, తదితర రూట్లలో నడిచే సర్వీసులను అధికారులు తగ్గించారు. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు.



అచ్యుతాపురం జంక్షన్‌లో స్తంభించిన ట్రాఫిక్

కేజీబీవీల్లో కలెక్షన్ కలకలం

- మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులు ఇప్పిస్తామంటూ టీచర్ల నుంచి డబ్బుల వసూళ్లకు సంఘ నేత యత్నం

- 7లో

క్రైం... crime news

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి


కశిరెడ్డి గణేశ్ మృతదేహం

రాంబిల్లి, మార్చి 7: మండలంలోని జంగాలపాలెం సమీపంలోని అప్పారాయుడుపాలెం జంక్షన్ రోడ్డు వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి రాంబిల్లి ఏఎస్ఐ ఎల్.రంగారావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. కృష్ణంపాలేనికి చెందిన కశిరెడ్డి గణేశ్(37) ఎస్ఈజడ్‌లోని కంపెనీల్లో కలాసీగా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం పనికి వెళ్లి రాత్రి 10 గంటలకు బైక్‌పై ఇంటికి వస్తుండగా వాహనం అదుపుతప్పి అప్పారాయుడుపాలెం జంక్షన్ రోడ్డు వద్ద గల మదుం కల్వర్టును ఢీకొట్టి పక్కనే ఉన్న గొయ్యిలో పడిపోయాడు. గురువారం ఉదయం కొందరు వ్యక్తులు అతని మృతదేహాన్ని గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వారు అక్కడికి చేరుకుని గణేశ్ మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతదేహాన్ని పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఏఎస్ఐ తెలిపారు.

అచ్యుతాపురంలో మరొకరు..


ఈశ్వరరావు (ఫైల్)

అచ్యుతాపురం, మార్చి 7: అచ్యుతాపురం మండలంలో రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనికి సంబంధించి హెచ్‌సీ కృష్ణ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మడుతూరుకి చెందిన మడుతూరు ఈశ్వరరావు (34) అచ్యుతాపురంలో సెలూన్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. బుధవారం రాత్రి 10 గంటలకు షాపు మూసేసి వాహనంపై స్వగ్రామం వెళుతుండగా ఎదురుగా వస్తున్న సెజ్‌లోని ఓ కర్మాగారానికి చెందిన అద్దె బస్సు బలంగా ఢీకొంది. దీంతో ఈశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు. మృతుని కుటుంబానికి రూ.30 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన కార్యదర్శి మోటూరు శ్రీవేణి డిమాండ్ చేశారు.

20 ఎకరాల్లో జీడిమామిడి, టేకు తోటలు దగ్ధం

రోలుగుంట, మార్చి 7: మండలంలోని కొవ్వూరు శివారులో బుధవారం అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో జీడిమామిడి, టేకు తోటలు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన యర్రంశెట్టి ప్రకాశ్, వై.అప్పలనాయుడు, వై.రాజుబాబు, వై.పెద్దినాయుడు, కోలిపల్లి ఈశ్వరరావులకు చెందిన సర్వే నంబరు 31లో సుమారు 20 ఎకరాల్లో తోటలు కాలిపోయాయి. గురువారం ఉదయం పొలాలకు వద్దకు వెళ్లిన రైతులు, దగ్ధమైన తోటలను చూసి ఖిన్నులయ్యారు. ప్రభుత్వం స్పందించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.

సారాబట్టీలపై ఎస్ఈబీ దాడులు

» 1,800 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం

నర్సీపట్నం, మార్చి 7: జిల్లాలోని నాతవరం, కోటవురట్ల మండలాల్లోని పలు గ్రామాల్లో సారాబట్టీలపై ఎస్ఈబీ అధికారులు దాడులు చేసి 1,800 లీటర్ల బెల్లం పులుసును ధ్వంసం చేశారు. అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ డి.శైలజారాణి ఆధ్వర్యంలో గురువారం నాతవరం మండలం జిల్లేడపూడి సమీపంలో సారాబట్టీపై సిబ్బంది దాడి చేశారు. ఈ సందర్భంగా 1,200 లీటర్లు బెల్లం పులుసు ధ్వసం చేశారు. కోటవురట్ల మండలం అక్సాహెబ్‌పేట సమీపంలో 600 లీటర్ల బెల్లం పులుసు ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ఇన్‌స్పెక్టర్లు షేక్ మీరా సాహెబ్, కె.సునీల్ కుమార్, ఎస్ఐలు పి.చిట్టిబాబు, బి.శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీరు ఇంటిలో నాటుసారా స్వాధీనం, తల్లి అరెస్టు

చీడికాడ, మార్చి 7: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో నివాసం ఉంటున్న నాగేటి కాంతమ్మ ఇంటిలో ఐదు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ నారాయణరావు తెలిపారు. ఈమె కుమారుడు నాగరాజు వలంటీర్‌గా పనిచేస్తున్నాడు. తాము దాడి చేసిన సమయంలో కాంతమ్మ నాటుసారా అమ్ముతున్నదని, ఆ సమయంలో వలంటీరు నాగరాజు ఇంటిలో లేడని, అందువల్ల అతనిపై కేసు నమోదు చేయలేదనిఇ ఎస్ఐ చెప్పారు.

ఆటో డ్రైవర్, జ్యూస్ షాప్ యజమాని మధ్య కొట్లాట

రావికమతం, మార్చి7: మండల కేంద్రంలో ఆటో డ్రైవర్, జ్యూస్ షాపు యజమాని మధ్య ఘర్షణ తలెత్తి, తీవ్ర స్థాయి గొడవకు దారి తీసింది. ఆటో డ్రైవర్‌కు మద్దతుగా మిగిలిన డ్రైవర్లు రావడంతో కొట్లాట జరిగింది. దీంతో ఇద్దరికి గాయాల య్యాయి. పోలీసులు వచ్చి ఇరువర్గాలను మందలించి స్టేషన్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా వున్నాయి. కొండెంపూడికి చెందిన మోహన్‌కృష్ణ అనే వ్యక్తి రావికమతం నాలుగు రోడ్ల కూడలి వద్ద ఇటీవల జ్యూస్ షాపు ప్రారంభించాడు. దీనికి ముందు ఆటో స్టాండు వుంది. పండ్ల రసం తీసిన తరువాత వ్యర్థాలను ఆటో పార్కింగ్ ప్రదేశంలో పడేస్తున్నాడు. దీనిపై ఆటో డ్రైవర్ బలిరెడ్డి శ్రీను అభ్యంతరం తెలిపాడు. వ్యర్థాలను డస్ట్‌బిన్‌లో వేస్తే పంచాయతీ పారిశుధ్య సిబ్బంది తీసుకెళతారని శ్రీను సూచించాడు. ఇందుకు నిరాకరించిన మోహన్‌కృష్ణ. తన షాపు ముందు ఆటోను నిలుపవద్దని స్పష్టం చేశాడు. దీంతో ఇరువురి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారి తీసింది. వీరిని విడిపించే ప్రయత్నంలో మరో షాపు యజమాని ముమ్మిన అర్జున్‌కు, ఆటో డ్రైవర్ శ్రీనును గాయాలయ్యాయి. దీంతో ఆటో డ్రైవర్ శ్రీనుకు అండగా మిగిలిన ఆటో డ్రైవర్లు వచ్చి, మోహన్‌కృష్ణపై దాడికి యత్నించడంతో అతను షాపు లోపలికి వెళ్లి షట్టర్ వేసుకున్నాడు. జ్యూస్ షాపు ముందున్న బల్లను ఆటో డ్రైవర్లు పక్కకు పడేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ ధనుంజయనాయుడు, ఏఎస్ఐ అప్పలరాజు, పోలీసుల సిబ్బందితో వచ్చి ఇరువర్గాలను మందలించారు. అనంతరం స్టేషన్‌కు తరలించారు.


జ్యూస్ షాపును ధ్వంసం చేస్తున్న ఆటో డ్రైవర్లు


గాయపడిన ఆటో డ్రైవర్ శ్రీను

ఉద్యోగాలు ఇప్పిస్తామని డబ్బులు వసూలు చేసిన సీఆర్‌పీపై ఫిర్యాదు

అనకాపల్లి రూరల్, మార్చి 7: ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసిన ఉపాధ్యాయురాలిపై అనకాపల్లి డీఎస్పీ కి డీఈవో వెంకటలక్ష్మమ్మ గురువారం ఫిర్యాదు చేశారు. దీనికి సంబం ధించి వివరాలిలా ఉన్నాయి. దేవరాపల్లి మండలం కేజీబీవీ పాఠశాలలో సీఆర్‌పీగా పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయిని సబ్బవరపు త్రిపురసుందరిదేవి కొంతమంది నిరుద్యోగుల నుంచి డబ్బులను వసూలు చేశారని డీఈవో తెలిపారు. ఆమెపై ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం తాను డీఎస్పీకి ఫిర్యాదు చేశానన్నారు. తన ఫిర్యాదుపై డీఎస్పీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారని పేర్కొన్నారు.

గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి

అనకాపల్లి టౌన్, మార్చి 7: స్థానిక విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గురువారం ఓ లారీ డ్రైవర్ గుండెపోటుతో మృతి చెందాడని పట్టణ ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. దీనికి సంబంధించి ఆయన తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. సూర్యాపేట జిల్లా ఆత్మకూరుకు చెందిన లారీ డ్రైవర్ కోడూరు యల్లయ్య (49)తో పాటు మరో లారీ డ్రైవర్ మద్ది నర్సిరెడ్డి పోర్టు నుంచి చోడవరానికి సిమెంట్ లోడు తీసుకువచ్చి దించారు. తిరిగి పోర్టుకు వెళుతున్న సమయంలో లారీలో కూర్చున్న యల్లయ్యకు అండర్‌బ్రిడ్జి వద్దకు వచ్చేసరికి గుండెలో నొప్పి రావడంతో ఎన్టీఆర్ వైద్యాలయానికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు చెప్పారు. లారీ డ్రైవర్ నర్సిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	475
విజయనగరం	479
శ్రీకాకుళం	479

నేటి నుంచే కల్యాణపులోవ జాతర

» మూడు రోజులపాటు నిర్వహణ
» ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
» మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా
» ప్రత్యేక బస్సులు నడుపుతున్న ఆర్టీసీ


ఉత్సవాలకు ముస్తాబైన పోతురాజుబాబు ఆలయం
పోతురాజుబాబుగా పూజలందుకుంటున్న శివలింగం

రావికమతం, మార్చి 7: మండలంలోని కల్యాణపులోవలో పోతురాజుబాబు, పెద్దింటమ్మవార్ల జాతరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మహాశివరాత్రి సందర్భంగా మూడు రోజులపాటు ఇక్కడ ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది మార్చి నెల 8, 9, 10 తేదీల్లో జాతర నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. జాతరకు వచ్చే భక్తులు ఇక్కడి జలాశయంలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయంలో పోతురాజుబాబు, పెద్దింటమ్మను దర్శించుకుంటారు. మూడు రోజుల్లో సుమారు మూడు లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, దేవదాయ, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, తదితర శాఖల ఉన్నతాధికారులు ఇక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు సౌకర్యాల కల్పనకు సంబంధించి కిందిస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఆలయ చరిత్ర

రావికమతం మండలం చీమలపాడు పంచాయతీ శివారు గిరిజన గ్రామమైన కల్యాణపులోవకు చెందిన గురవడు అనే గిరిజనుడికి సుమారు 200 సంవత్సరాల క్రితం పోతురాజుబాబు కలలో కనిపించి, మూడు కొండల మధ్యనున్న అటవీ ప్రాంతంలో కొలువుదీరానని, గెడ్డ ఒడ్డున ఉన్న పెద్ద బూరుగు మాను మొదట్లో తనకు గుడికట్టాలని చెప్పి మాయమయ్యాడట. అతను ఈ విషయాన్ని కుటుంబ సభ్యులతోపాటు గ్రామస్థులకు చెప్పి, అడవిలో బూరుగు చెట్టు కోసం వెతికారు. గెడ్డ ఒడ్డున కాంతిపుంజంతో పెద్ద బూరుగు చెట్టు మాను కన్పించింది. వెంటనే అక్కడ పూజలు నిర్వహించి, తాటాకులతో మందిరం నిర్మించారు. అప్పటి నుంచి మహాశివరాత్రికి మూడు రోజులపాటు ఇక్కడ జాతర నిర్వహి స్తున్నారు. కాగా 1965లో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడంతో పోతురాజుబాబు ఆలయం జలాశయం గర్భంలో కలిసిపోయింది. దీంతో రిజర్వాయర్ దిగువున నూతన ఆలయాన్ని నిర్మించారు.

కల్యాణపులోవ జాతరకు ఏర్పాట్లు పూర్తి

కల్యాణపులోవ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పలు శాఖల అధికారులు ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్లలో నిల్చునే భక్తులు ఎండబారిన పడకుండా తాటాకు పందిళ్లు, షామి యానాలు వేశారు. మూడు రోజుల పాటు భక్తులకు అన్నసమారాధన చేయ నున్నారు. జలా శయంలో పుణ్యస్నానాల అనంతరం మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కలిక గదులు ఏర్పాటు చేశారు. స్నానమాచరించే క్రమంలో భక్తులు నీటిలో మునిగి పోతే రక్షించడానికి గజఈతగాళ్లను, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో వుంచారు. వైద్యశిబిరం ఏర్పాటు చేస్తారు.

కల్యాణపులోవ, పుణ్యగిరికి ప్రత్యేక బస్సులు

అనకాపల్లి టౌన్, మార్చి 7: మహాశివరాత్రి సందర్భంగా కల్యాణపులోవ, పుణ్యగిరికి గురువారం నుంచి శనివారం వరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నామని పీటీడీ డీపీటీవో పద్మావతి తెలిపారు. అనకాపల్లి డిపో నుంచి కల్యాణపులోవకు గురువారం రెండు బస్సులు నడిపామన్నారు. ఎనిమిది, తొమ్మిది తేదీల్లో 20 బస్సులు నడుపుతున్నామని, పుణ్యగిరికి పది బస్సులు సిద్ధం చేశామన్నారు. నర్సీపట్నం డిపో నుంచి గురువారం కల్యాణపులోవకు నాలుగు బస్సులు నడపగా, ఎనిమిది, తొమ్మిది తేదీల్లో 25 బస్సులు చొప్పున నడపనున్నామన్నారు. ధారమఠానికి 15 బస్సులు నడుపుతున్నామన్నారు.

ఓటర్లను బెదిరిస్తే తరిమి కొడతారు

» వలంటీర్లకు మాజీ మంత్రి అయ్యన్న హెచ్చరిక
» జగన్ పాలనలో రాష్ట్రం సర్వనాశనమైందని ఆరోపణ


శంఖారావం సభలో మాట్లాడుతున్న అయ్యన్నపాత్రుడు

నాతవరం, మార్చి 7: కొన్ని గ్రామాల్లో వలంటీర్లు ఓటర్లను బెదిరిస్తున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వైసీపీకి ఓటు వేయాలని బెదిరిస్తే వలంటీర్లను ప్రజలు తరిమి కొడతారని మాజీ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు హెచ్చరించారు. గురువారం రాత్రి మండలంలోని గొలుగొండపేటలో ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన మాట్లాడుతూ, మాయమాటలతో అధికారంలోకి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశాడని ధ్వజమెత్తారు. విద్యుత్ చార్జీలు తొమ్మిదిసార్లు పెంచారని, మద్యపాన నిషేధం విధిస్తానని ప్రజలను మోసం చేశారని ఆరోపించారు. తన హయంలో నాతవరం మండలంలో ఎన్నో రోడ్లు వేయించానని, వైసీపీ ప్రభుత్వం రోడ్లకు మరమ్మతులు చేయించలేదని దుస్థితిలో వుందన్నారు. రూ.470 కోట్ల అంచనా వ్య యంతో ఏలేరు-తాండవ ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి జగన్ శంకుస్థాపన చేసి ఏడాది కావస్తున్నప్పటికీ నిధులు మంజూరు చేయలేదని చెప్పారు. నర్సీపట్నం నుంచి వరుసగా పదిసార్లు ఎమ్మెల్యేగా పోటీచేయడం తన అదృష్టంగా భావిస్తానని, ఇవే చివరి ఎన్నికలని, తనను మరోమారు గెలిపించి నియోజకవర్గం అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు కరక సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి గొంప చిట్టిబాబు, నర్సీపట్నం మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లాలం అచ్చిరాజు, మాజీ ఎంపీపీలు ఎస్.విజయ్‌కుమార్ సింగంపల్లి సన్యాసిదేముడు, తాండవ ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ కొండబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు శెట్టి లోవ, టీడీపీ నాయకులు బొడ్డు సత్యనారాయణ, మిరపల దొరబాబు, ఇ.సత్య సీతారామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మద్య నిషేధంపై మాట తప్పిన సీఎం

» వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు జగన్‌కు లేదు
» ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి



చోడవరంలో నినాదాలు చేస్తున్న ఏపీ మహిళా సమాఖ్య సభ్యులు

చోడవరం, మార్చి 7: రాష్ట్రంలో మద్యపాన నిషేధాన్ని అమలు చేయకుండా మాట తప్పిన సీఎం జగన్మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓట్లు అడిగే హక్కు లేదని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు బూసి పరమేశ్వరి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మద్య నిషేధంపై ఇచ్చిన హామీకి సీఎం జగన్ తిలోదకాలు ఇవ్వడానికి నిరసనగా పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. దశలవారీగా మద్యనిషేధాన్ని అమలు చేస్తానని, ఆ తరువాతే ఓట్లు అడుగుతానని గత ఎన్నికల ముందు చెప్పిన జగన్‌రెడ్డి.. అధికారంలోకి వచ్చిన తనువాత మద్యం ద్వారా భారీగా ఆదాయాన్ని పెంచుకున్నారని ధ్వజమెత్తారు. బూటకపు హామీలతో గద్దెనెక్కిన జగన్‌కు వచ్చే ఎన్నికల్లో మహిళలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి కనక మహాలక్ష్మి, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

చెక్కపై శివుడు


దార్ల రవి చెక్కపై చెక్కిన శివుని రూపం

నక్కపల్లి, మార్చి 7: మండలంలోని చినదొడ్డిగల్లు గ్రామానికి చెందిన సూక్ష్మ కళాకారుడు దార్ల రవి మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా చెక్కతో శివుడి రూపాన్ని చెక్కాడు. చెక్కపై శివలింగం, శివుడు నడిచివెళుతున్నట్టు, ఆ వెనుక నందిని ఎంతో అద్భుతంగా తీర్చిదిద్ది తన కళా నైపుణ్యం చాటుకున్నాడు. ఈ కళాఖండం పలువురిని ఆకట్టుకుంటోంది.

శైవ క్షేత్రాల వద్ద పటిష్ఠ బందోబస్తు

» ఎస్పీ కేవీ మురళీకృష్ణ



అనకాపల్లి రూరల్, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లా వ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాల వద్ద పటిష్ఠ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్టు ఎస్పీ కేవీ మురళీకృష్ణ తెలిపారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ శివాలయాలకు దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగినంత సిబ్బందితో బందోబస్తు నిర్వహించామన్నారు. భక్తుల తాకిడి అధికంగా ఉన్నచోట్ల క్యూలైన్లు, ఎంట్రీ, ఎగ్జిట్ గేట్లు ఏర్పాటు చేశామన్నారు.

సొమ్ము ప్రజలది... సోకు జగన్‌ది!

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు నాగజగదీశ్

తుమ్మపాల, మార్చి 7: ప్రజాధనంతో వైసీపీ ఎన్నికల శంఖారావం ఏర్పాటు చేయడం సిగ్గుచేటని, సర్కారు సొమ్ముతో సీఎం జగన్ సోకులు చేయడం హాస్యాస్పదమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికార యంత్రాంగం సైతం విధి నిర్వహణలో ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రవర్తించడం దారుణమన్నారు. సొంతంగా పార్టీ తరఫున ఎన్నికల సభలు నిర్వహించుకోలేని జగన్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల పేరుతో అధికార దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రజలను, వలంటీర్లు బలవంతంగా సభలకు తరలిస్తున్నారన్నారు. అనకాపల్లి నియోజకవర్గానికి ఇచ్చిన హామీలన్నీ గాలికి వదిలేసి ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని సిద్ధం సభను నిర్వహించారని ప్రశ్నించారు. ప్రజలు స్వచ్ఛందంగా సభకు హాజరయ్యే పరిస్థితి కానరావడం లేదన్నారు. ప్రజల మనసును గెలుచుకున్న ఏకైక నాయకుడు చంద్రబాబు అని స్పష్టం చేశారు.

అమర్‌కు టికెట్ లేనట్టే?

... 5వ పేజీ తరువాయి

కూడా రత్నాకర్ పేరును పరిగణనలోకి తీసుకోకుండా భరత్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. దాంతో వీరభద్రరావు, రత్నాకర్‌లు కొద్దికాలం క్రితం వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరారు. జగన్ 'గుండెల్లో పెట్టుకుంటాను' అంటే దాని అర్థం ఇలాగే ఉంటుందని ఆ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు అంటున్నారు. వాస్తవానికి గుడివాడ అమర్‌నాథ్ మంత్రి అయిన తొలిరోజుల్లో మీడియా ముందు చేసిన 'కోడిగుడ్డు' వ్యాఖ్యలతో పార్టీకి చెడ్డపేరు వచ్చింది. కేవలం జనసేన అధినేతను దూషించడమే పనిగా పెట్టుకోవడంతో సొంత సామాజిక వర్గం కూడా ఆయనకు కలిసి రాలేదు. ఈ నేపథ్యంలోనే ఆయన్ను ఈసారికి పక్కన పెట్టేశారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

సైనికుడిలా పనిచేస్తా: మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఇదే సభలో పాల్గొన్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ, ఈ ఎన్నికల్లో తనకు పోటీ చేసే అవకాశం లేకపోయినా సరే సైనికుడిలా జగన్‌ను ముఖ్యమంత్రిని చేయడానికి పనిచేస్తానని ప్రకటించారు.

జనసేనకు 4

... 5వ పేజీ తరువాయి

కేటాయించాలని సూచించారు. దీనిపై ఇంకా తుది నిర్ణయం వెలువడలేదు. పెందుర్తి ఒకవేళ జనసేనకు ఇచ్చినట్టయితే ఆ పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు పోటీ చేసే అవకాశం ఉంది. పంచకర్ల వైసీపీకి రాజీనామా చేసి జనసేనలో చేరినప్పుడు పెందుర్తి నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని అధినేతను కోరగా..ఆయన భరోసా ఇచ్చారని, ఆ మాట ప్రకారమే పొత్తుల్లో పెందుర్తి సీటును కోరారని పార్టీ నాయకులు చెబుతున్నారు.

'దక్షిణం'లో ఆశావహులు అనేకం

విశాఖ జిల్లాకు వచ్చేసరికి ఏడు అసెంబ్లీ స్థానాలు (ఆరు పూర్తిగా, ఒకటి పాక్షికంగా) ఉండగా..మొదట మూడు (గాజువాక, భీమిలి, విశాఖ దక్షిణం) సీట్లు ఇవ్వాలని జనసేన ప్రతిపాదించింది. అయితే అందుకు టీడీపీ అధిష్ఠానం ఒప్పుకోలేదు. దక్షిణ నియోజకవర్గం సీటు ఇచ్చేందుకు అంగీకరించింది. ఈ సీటు కోసం జనసేనలో అనేక మంది పోటీ పడుతున్నారు. అయితే వైసీపీ ఎమ్మెల్సీగా ఉంటూ ఆ పార్టీకి రాజీనామా చేసి జనసేనలో చేరిన వంశీకృష్ణ శ్రీనివాస యాదవ్‌కు అవకాశం లభించవచ్చునని ప్రచారం జరుగుతోంది. గత కొంతకాలంగా దక్షిణంలో టీడీపీ ఇన్‌చార్జిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీకి వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం ఇస్తారని ప్రచారం జరుగుతోంది.

కేజీబీవీల్లో కలెక్షన్ కలకలం

» మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చేలా ఉత్తర్వులు ఇప్పిస్తామంటూ టీచర్ల నుంచి డబ్బుల వసూళ్లకు సంఘ నేత యత్నం
» ప్రభుత్వంలో అత్యంత కీలకమైన వ్యక్తుల సహకారం ఉన్నట్టు మెసేజ్‌లు
» ప్రతి కేజీబీవీ నుంచి రూ.2.8 లక్షలు వసూలు లక్ష్యం
» విషయం సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారుల దృష్టికి రావడంతో పైకి ఫిర్యాదు
» విచారణలో వాస్తవం అని తేలడంతో సంఘ నేత, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి కేజీబీవీ సీఆర్‌టీ తొలగింపు
» కేసు నమోదు

విశాఖపట్నం/అనకాపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కస్తూర్బాగాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్లను మినిమం టైమ్ స్కేల్ పరిధిలోకి తీసుకువచ్చేలా ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు తీసుకువస్తానంటూ సదరు సంఘ నేత డబ్బుల వసూళ్లకు శ్రీకారం చుట్టిన విషయం వెలుగుచూసింది. రాష్ట్రవ్యాప్తంగా కేజీబీవీల్లో కలకలం రేపుతున్న ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అనకాపల్లి జిల్లా దేవరాపల్లి కేజీబీవీలో తెలుగు సీఆర్‌టీగా పనిచేస్తున్న ఎస్‌బీటీఎస్ దేవి (కేజీబీవీ టీచర్ల సంఘం నేత)ని విధుల నుంచి తొలగించారు. అంతేగాకుండా ఆమెపై పోలీసులకు అనకాపల్లి డీఈవో ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి.

రాష్ట్రంలోని 352 కేజీబీవీల్లో టీచర్లు కాంట్రాక్టు ప్రాతిపదికపైనే పనిచేస్తున్నారు. ఏడాదికి ఒకసారి వీరి సర్వీస్‌ను పునరుద్ధరిస్తుంటారు. కాంట్రాక్టు టీచర్ల పోరాటం ఫలితంగా ఇటీవల జీతాలు స్వల్పంగా పెంచారు. ప్రస్తుతం కేజీబీవీ ప్రిన్సిపాల్‌కు రూ.32 వేలు, సీఆర్‌టీలకు రూ.27 వేలు ఇస్తున్నారు. అయితే మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) పరిధిలోకి వెళితే జీతాలు పెరగడమే కాకుండా సర్వీస్‌లో బ్రేక్ ఉండదని సంఘ నేతగా ఉన్న దేవి...నమ్మబలికారు. త్వరలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వెంటనే సొమ్ములు ఇవ్వాలని, ప్రతి స్కూలు నుంచి ఒకరిద్దరు వసూలు బాధ్యత తీసుకోవాలని అన్ని జిల్లాల కేజీబీవీ టీచర్లకు చెందిన వాట్సాప్ గ్రూపులలో ఆమె మెసేజ్‌లు పెట్టారు. ప్రతి కేజీబీవీ నుంచి రూ.2.8 లక్షలు వంతున 352 కేజీబీవీల నుంచి రూ.కోట్లలో వసూలుచేసి 'పెద్దలకు' ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఇందుకు ప్రభుత్వంలో అత్యంత కీలకమైన వ్యక్తుల సహకారం ఉన్నట్టు ఆమె చెప్పారు. అనుకున్న మొత్తం చూపించగలిగితే మరుసటిరోజు సాయంత్రానికి ఎంటీఎస్ వర్తింపజేస్తూ ఆదేశాలు వస్తాయని ఆ మెసేజ్‌లో పేర్కొన్నారు. దీనిపై సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారులు...సీఎం పేషీకి ఫిర్యాదుచేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో ఒకరు రంగంలోకి దిగి విచారణ చేయాలని సమగ్రశిక్షా అభియాన్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ఉన్నతాధికారులు పలు జిల్లాల కేజీబీవీ టీచర్ల గ్రూపులకు వచ్చిన మెసేజ్‌లపై విచారించినప్పుడు వసూళ్లకు నిర్ణయించడం వాస్తవమేనని తేలింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకు తక్షణమే దేవిపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి డీఈవోను ఆదేశించారు. దీంతో దేవరాపల్లి కేజీబీవీ తెలుగు సీఆర్‌టీ దేవిని విధుల నుంచి తొలగిస్తూ బుధవారం రాత్రి అనకాపల్లి డీఈవో/సమగ్రశిక్షా ఎక్స్ అఫిషియో ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ ఎం.వెంకటలక్ష్మమ్మ ఉత్తర్వులు జారీచేశారు. అనంతరం ఆమె స్వయంగా అనకాపల్లి డీఎస్పీని కలిసి దేవిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు దేవిపై అనకాపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదుచేశారు.

దేవి వెనుక కీలక అధికారి?

కేజీబీవీ సంఘ నేతగా ఉన్న దేవిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సమగ్రశిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన ఆందోళన సందర్భంగా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరించారని అప్పట్లో ఉద్యోగులు ఆరోపించారు. సమగ్ర శిక్షా అభియాన్ ప్రధాన కార్యాలయంలో ఒక కీలక అధికారి ఆశీస్సులు ఉండడంతో దేవి అన్ని కేజీబీవీలపై పెత్తనం చెలాయిస్తున్నారని పలువురు చెబుతుంటారు. కాగా ఉత్తరాంధ్ర పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థికి మద్దతుగా ఆమె గత ఏడాది దసపల్లా హోటల్‌లో కేజీబీవీ టీచర్లతో సమావేశం ఏర్పాటుచేశారు.

ఉత్సాహంగా ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న రఘునాథ్

అనకాపల్లి టౌన్, మార్చి 7: స్థానిక గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో అనకాపల్లి వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఉత్తరాంధ్ర స్థాయి ఆహ్వానపు వాలీబాల్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను ఆదినారాయణ మహిళా కళాశాల కరస్పాండెంట్ కొణతాల రఘునాథ్ ప్రారంభించారు. మొదటి పోటీ అనకాపల్లి - ఎలమంచిలి జట్ల మధ్య జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, ఎస్‌డీ గ్రూప్ అధినేత కాండ్రేగుల శ్రీరామ్, సామాజికవేత్త గంటి రవికుమార్, జార్జిక్లబ్ కార్యదర్శి బుద్ద కాశీవిశ్వేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.





శివరాత్రికి ముస్తాబైన శివాలయాలు

అనకాపల్లి టౌన్, మార్చి 7 : మహాశివరాత్రికి పట్టణంలోని శివాలయాలు ముస్తాబయ్యాయి. పట్టణంలోని కాశీవిశ్వేశ్వర, సిద్ధిలింగేశ్వర, భోగలింగేశ్వర, శారదానది ఒడ్డున గల ఉమా రామలింగేశ్వర, కూరగాయల మార్కెట్ వద్ద గల శివాలయాలతోపాటు కామాక్షి సమేత ఏకాంబరేశ్వరస్వామి ఆలయాలను నిర్వాహకులు సిద్ధం చేశారు. శుక్రవారం వేకువజామున 4 గంటలకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పరవాడలో.. మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని పలు శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. పరవాడలోని మల్లికార్జునస్వామి ఆలయం, తాడి గ్రామంలోని పురాతన ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే భరణికం, లేమర్తి, స్వయంభూవరం, ముత్యాలమ్మపాలెం, దీపాంజలినగర్ గల శివాలయాల్లో శివరాత్రి పూజలు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉంటే మహాశివరాత్రి అనంతరం జాగారం స్నానాలు చేసేందుకు ముత్యాలమ్మపాలెం సముద్రతీరంలో వెళ్లే భక్తుల కోసం పరవాడ సీఐ బాల సూర్యారావు బందోబస్తు ఏర్పాటు చేశారు.


తాడి గ్రామంలోని ఉమా నీలకంఠేశ్వరస్వామి

పాయకరావుపేట రూరల్‌లో.. మండలంలోని శివాలయాలు మహాశివరాత్రి మహోత్సవాలకు సిద్ధమయ్యాయి. మండలంలోని సత్యవరం, రాజగోపాలపురం, పెంటకోట, పెద్దిపాలెం, గోపాలపట్నం సీతమ్మవారి కొండ, నామవరం గ్రామాలలోని శివాలయాలను భక్తులు దర్శించుకుంటారు. ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

అచ్యుతాపురంలో.. శివరాత్రి సందర్భంగా గ్రామాల్లో శివాలయాలు ముస్తాబయ్యాయి. మండలంలోని నునపర్తి, హరిపాలెం, పెదపాడు, మడుతూరు, కొండకర్ల, దోసూరు, అచ్యుతాపురంల్లో శివాలయాలను ఆలయ కమిటీలు సిద్ధం చేశాయి. సెజ్ పునరావాస కాలనీ (దిబ్బపాలెం)లో గల ఐశ్వర్య నర్మదేశ్వర స్వామి ఆలయం శివరాత్రికి సిద్ధమైంది.

రాంబిల్లిలో.. మహాశివరాత్రికి మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న శివాలయాలు ముస్తాబయ్యాయి. పంచదార్ల, దిమిలి, కట్టుబోలు, లాలంకోడూరు, కొత్తపట్నం గ్రామాల్లోని శివాలయాల్లో నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆయా గ్రామాల్లోని శివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నారు. సాయంత్రం భక్తులు జాగరణ చేయనున్నారు.

నక్కపల్లిలో.. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ముక్కంటి కొలువైన ఆలయాలు సిద్ధమయ్యాయి. మండలంలోని ఉపమాక శివాలయంలో శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు త్రినేత్రుడికి తొలి అభిషేకం జరుగుతుందని ఆలయ అర్చకులు మహేశ్, సంతోశ్ చెప్పారు. గొడిచెర్ల శివాలయంలో మహాశివరాత్రి కోసం ఏర్పాట్లు చేశారు.

మహిళా సాధికారితతోనే దేశాభివృద్ధి

హరియాణా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ పరమేష్ కుమారి

ఎలమంచిలి, మార్చి 7: మహిళలు స్వశక్తితో ఎదిగినాడే సాధికారిత సాధ్యపడుతుందని హరియాణా బాబా మస్తాన్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.పరమేష్ కుమారి అన్నారు. గురువారం స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పూర్వం రోజుల్లో మహిళలు కేవలం గృహిణులుగా మాత్రమే ఉండేవారని, ఆధునిక కాలంలో అన్ని రంగాల్లో ముందుకు దూసుకుపోతున్నారన్నారు. బీహార్‌లోని సహౌస భూపేంద్ర నారాయణ్ మిథిలా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్. కుమారి అపర్ణ మాట్లాడుతూ అంతర్జాతీయంగా మహిళలు అన్ని రంగాల్లోనూ పురోగమిస్తున్నారన్నారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆధునిక మహిళ చరిత్రను తిరగరాస్తుందని నూరేళ్ల క్రితం గురజాడ అప్పారావు చెప్పిన మాట ప్రస్తుతం నిజమవుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్‌గా డాక్టర్. కె.సుధారాణి వ్యవహరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అనకాపల్లి టౌన్‌లో.. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ సీహెచ్. రూపాదేవి అన్నారు. గురువారం సీఐటీయూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. మార్చి 15వ తేదీ వరకు మహిళా దినోత్సవ సభలు, సమావేశాలు, ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శ్రీలక్ష్మి, డీడీ వరలక్ష్మి పాల్గొన్నారు.

డైట్ ఇంజినీరింగ్ కళాశాలలో.. డైట్‌లో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అత్యున్నతమైన స్థానాల్లో నిలిచి ప్రతిభను చాటుతున్నారన్నారు. ఉద్యోగాలు చేసే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. వైకుంఠరావు మాట్లాడుతూ మహిళలకు అవకాశాలిస్తే దేశం మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇంటి వద్ద తల్లికి విద్యార్థినులు ఏ విధంగా సహాయపడుతున్నారో వీడియోను చిత్రీకరించే పోటీలను ఈ సందర్భంగా నిర్వహించారు. వీరిలో బెస్ట్ వీడియోగా ఎంపికైన విద్యార్థిని తల్లిని సత్కరించారు.

డీవీఎన్ కళాశాలలో.. స్థానిక దాడి వీరునాయుడు కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యురాలు ఎం.మానస, న్యాయవాది బి.హిమగిరి, ఎయిర్‌హోస్టెస్ టి. శ్రావణి, వరల్డ్ చాంపియన్ ప్లేయర్ కె.అరుణ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్. దయామాధురి పాల్గొన్నారు.


ఎలమంచిలి కళాశాలలో మాట్లాడుతున్న వక్తలు

తుమ్మపాలలో.. మహిళలంతా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని దిశ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాములమ్మ పేర్కొన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఎస్‌వీడీఎస్ కార్యాలయంలో గురువారం మహిళలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళలు సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీడీఎస్ కార్యదర్శి కర్రి జోగినాయుడు, యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నరేష్, సోషల్ వర్కర్ లావణ్య, లూపిన్ కంపెనీ మేనేజర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే స్టేట్‌బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్‌లను అందజేశారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ కె. జగదీశ్వరరావు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రతినిధులు బి.వి జయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

సబ్బవరంలో.. మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి పిలుపునిచ్చారు. గురువారం కళాశాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ ఎం. రత్నప్రకాశ్, డాక్టర్ ఎస్. సత్యనారాయణ, ఎంవీ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎల్.గణేష్,విద్యార్థినులు పాల్గొన్నారు.


డైట్‌లో విద్యార్థిని తల్లిని సత్కరించిన దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న దిశా ఎస్ఐ రాములమ్మ

'మహాగర్జనను విజయవంతం చేయాలి'

అచ్యుతాపురం, మార్చి 7: ఈనెల 9న అమరావతిలో దివ్యాంగుల పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగే మహాగర్జన సభను విజయవంతం చేయాలని పూడిమడక స్వామి వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేరుగు నూకరాజు కోరారు. గురువారం పూడిమడకలో జరిగిన సమావేశంలో వాల్‌పోస్టర్‌ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గంధవరపు రాజు, కోట, ధనలక్ష్మి, కాసు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెన్త్ పరీక్ష పేపర్లు

ఎలమంచిలి, మార్చి 7: పదో తరగతి పరీక్ష పేపర్లు పట్టణ పోలీస్‌స్టేషన్‌కు బుధవారం చేరుకున్నాయి. అధికారుల సమక్షంలో వాటిని పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు.

ఏప్రిల్ 25న గురుకులాల ప్రవేశ పరీక్ష

అచ్యుతాపురం, మార్చి 7: గురుకులాల ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 25వ తేదీన నిర్వహిస్తున్నట్టు స్థానిక ఏపీ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎం.ప్రమీలకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. గురుకుల పాఠశాలల్లో ఆరు నుంచి ఎనిమిది, ఇంటర్ ప్రథమ, డిగ్రీ ప్రథమ సంవత్సరాల్లో చేరేందుకు పరీక్ష నిర్వహిస్తున్నారన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 31 చివరి తేదీ అని ఆమె పేర్కొన్నారు.

'జనసేన, టీడీపీ బలోపేతానికి కృషి చేయండి'

కొత్తూరు, మార్చి 6 : జనసేన-టీడీపీల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్పీటీసీ మాజీ సభ్యుడు, జనసేన పార్టీ నాయకుడు భరత్‌బాబు పిలుపునిచ్చారు. గురువారం ఆయన రొంగలివానిపాలెం, కూండ్రం గ్రామాల్లో పర్యటించి పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. రానున్నది జనసేన-తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ప్రభుత్వమన్నారు. అనంతరం జనసేన ప్లకార్డులను ఇంటింటికీ పంచారు. మాజీ ఎంపీపీ రొంగలి శ్రీరామ్మూర్తి, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యుడు చదరం నాగేశ్వరరావు, గణేష్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేస్తా : సీఎం

కొత్తూరు/కశింకోట, మార్చి 7 : మండలంలోని సమస్యలను పరిష్కరించాలని మంత్రి అమర్‌నాథ్ పిసినికాడ సభకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కోరారు. అనకాపల్లి మార్కెట్ యార్డులో కోల్డ్ స్టోరేజీ, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ.5కోట్లు, కశింకోట శారదా బ్రిడ్జి మరమ్మతుకు రూ.3కోట్లు, రేబాక వద్ద డబుల్ రోడ్డు అభివృద్ధికి రూ.3కోట్లు, అనకాపల్లి-బవులవాడ, తుమ్మపాలు-బొజ్జన్నకొండ రోడ్డు అభివృద్ధికి రూ.4కోట్లు, జగనన్న ఇళ్ల కాలనీ వద్ద రిటైనింగ్ వాల్ నిర్మించడానికి రూ.6కోట్లు మంజూరు చేయాలని కోరగా.. వాటిని మంజూరు చేస్తానని సీఎం ప్రకటించారు.

సీఎం ఆదేశాలతో చెక్కులు పంపిణీ

కొత్తూరు, మార్చి 7: ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చెక్కులను జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి గురువారం పంపిణీ చేశారు. గురువారం మధ్యాహ్నం ముఖ్యమంత్రిని కలిసిన వ్యాధిగ్రస్తులకు ఆయన ఇచ్చిన భరోసా మేరకు వైద్య పరీక్షలను బట్టి అవసరమైన మొత్తాన్ని కలెక్టర్ అందజేశారు. మొత్తం 22 మందిలో 17 మందికి చెక్కులు అందజేశారు. వీరందరికీ రూ.22లక్షలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి పాల్గొన్నారు.

ఘనంగా టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు

ఎస్.రాయవరం, మార్చి 7: మండలంలోని పెదగుమ్ములూరు జడ్పీ హైస్కూల్‌లో గురువారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఉప విద్యాశాఖాధికారి అప్పారావు నైట్ స్టడీ అవర్స్‌లో టెన్త్ విద్యార్థులకు అల్పాహారానికి ఆర్థిక సహాయం అందించిన దాతలను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సుధాకర్, సీతారామరాజు, డాక్టర్ అనిల్‌వర్మ, నవీన్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

పరవాడ, మార్చి 7: మండలంలోని బొద్దపువానిపాలెం అభయాంజనేయస్వామి ఆలయ తొమ్మిదవ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి భక్తులు స్వామివారికి పూజలు చేశారు. సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్‌కాసులు దంపతులతోపాటు మాజీ సర్పంచులు అట్టా సన్యాసిఅప్పారావు, బొద్దపు నూకరత్నం, నాయకులు మేడిశెట్టి అప్పారావు, బొద్దపు వెంకటరమణ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను నిర్వహించారు.

పదిలో శత శాతం ఫలితాలు సాధించాలి

సబ్బవరం, మార్చి 8 : పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించాలని ఎంఈవో బీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదిని పరిశీలించారు. బాలికలు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి అత్యధిక మార్కులు సాధించాలని సూచించారు. అనంతరం సెట్-2 ఎస్ఎస్‌సీ పరీక్షా పేపర్లను స్థానిక పీఎస్‌లో భద్రపరిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

గొర్లివానిపాలెంలో లక్ష కుంకుమార్చన

సబ్బవరం, మార్చి 7: సబ్బవరం శివారు గొర్లివానిపాలెంలో ఉమారామలింగేశ్వర, లక్ష్మీసత్యనారాయణ మూర్తి, కోదండ సీతారామస్వామివార్ల దేవస్థానంలో మహా శివరాత్రి, 47వ కల్యాణ వార్షికోత్సవంలో భాగంగా గురువారం లక్ష కుంకుమార్చన పూజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఉచిత ప్రసాద వితరణ జరిగింది. ఆలయ ధర్మకర్త గొర్లి అచ్చింనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీఎంపీపీ గొర్లి ఉమామహేశ్వరరావుపాల్గొన్నారు.

సీఎం సభ వద్ద ఏఐఎస్ఎఫ్ ధర్నా

అనకాపల్లి టౌన్, మార్చి 7 : అనకాపల్లి జిల్లా కేంద్రంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలంటూ ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ ప్రతినిధులు సీఎం సభా ప్రాంగణంలో ప్లకార్డులతో గురువారం ధర్నా చేశారు. జిల్లా ఏర్పడినా ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడం విచారకరమని ఆందోళనకారులు పేర్కొన్నారు. అలాగే ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువయ్యాయన్నారు. రాష్ట్రంలో ఉన్న వసతిగృహాల మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. బాబ్జి, జి. ఫణేంద్ర బాబు డిమాండ్ చేశారు. అలాగే ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వియ్యపురాజు డిమాండ్ చేశారు.



ప్లకార్డులతో ధర్నా చేస్తున్న దృశ్యం

వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

అచ్యుతాపురం, మార్చి 7: మండలంలోని పూడి ఆర్.ఆర్ కాలనీలో గురువారం మహాగణపతి, మహాలక్ష్మీసీతారామ లక్ష్మణ సహిత హనుమత్ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి మంటప పూజలు, పూర్ణాహుతి, పంచలోహ స్థాపన వంటి క్రతువులు జరిగాయి. అనంతరం సీతారామస్వామి శాంతి హోమాన్ని నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు సుందరపు విజయకుమార్, లాలం చందు, భైలపూడి శ్రీరామదారు, కె. పవన్ విజయ్, సర్పంచ్ లాలం శ్రీనివాసరావు, రుత్తల శ్రీను, పైల భాను పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ వార్షికోత్సవం

పాయకరావుపేట, మార్చి 7 : రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శాఖ వార్షికోత్సవం గురువారం పాయకరావుపేటలో ఘనంగా జరిగింది. స్థానిక మంగవరంరోడ్డులోని సీతారామాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సత్యనారాయణ, జిల్లా ధర్మజాగరం ప్రముఖ్ సీహెచ్.మాలకొండయ్య, సహస్ర హాస్పటల్ అధినేత డాక్టర్ కంభంపాటి శివకుమార్ తదితరులు ఆర్ఎస్ఎస్ లక్ష్యాలు, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, దేశభక్తి, నిస్వార్థ సేవాభావం, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలపై ప్రసంగించారు. కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ సబ్ డివిజన్ సంజయ్ నీలాపు వెంకటరెడ్డి, ధర్మప్రచారక్ కట్టా వీరబాబు, అధిక సంఖ్యలో ఆర్ఎస్ఎస్ కర సేవకులు పాల్గొన్నారు.

ఫార్మాసిటీలో ఆకట్టుకున్న మాక్‌డ్రిల్

పరవాడ, మార్చి 7 : జాతీయ భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం ఫార్మాసిటీలో నిర్వహించిన మాక్‌డ్రిల్ అందరినీ ఆకట్టుకుంది. పరిశ్రమల్లో ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులను ఎలా రక్షించాలి, వారిని ఆసుపత్రులకు ఎలా తరలించాలో మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ మాక్‌డ్రిల్‌ను లారస్ ల్యాబ్స్‌కు చెందిన సింథిసిస్ పరిశ్రమలో నిర్వహించారు. ఈ విధానాన్ని ఆఫ్‌సైట్ మాక్‌డ్రిల్‌గా పిలుస్తారని పరిశ్రమల శాఖ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీ సురేష్ తెలిపారు. మాక్‌డ్రిల్‌ను ఏడీఎఫ్‌వో ప్రసాదరావు, ఎన్‌డీఆర్ఎఫ్ లీడర్ ఈశ్వరరావు, లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు, ఎస్ఏఎస్ఆర్ఎం అధ్యక్ష, కార్యదర్శులు శివరామప్రసాద్, సుబ్బారావు పర్యవేక్షించారు.

గుంటపల్లిలో దుర్గాదేవి జాతర

పాయకరావుపేట రూరల్, మార్చి7: మండలంలోని గుంటపల్లిలో దుర్గాంబికాదేవి జాతర గురువారం ఘనంగా జరిగింది. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి, ఆలయ ధర్మకర్త గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో అమ్మవారి ఉత్సవమూర్తిని ఊరేగించారు. ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాన్ని పూలు, విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. అమ్మవారిని గెడ్డం బుజ్జి కుటుంబ సభ్యులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గెడ్డం కన్నబాబు, గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాశ్, దుర్గ పాల్గొన్నారు.

విజయ గణపతి ఆలయ వార్షికోత్సవం

పాయకరావుపేట, మార్చి 7 : స్థానిక బృందావనంలోని దుర్గాలమ్మ చెట్టు ఆలయ ప్రాంగణంలో విజయ గణపతిస్వామి ఆలయ 9వ వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గణపతిస్వామివారిని వివిధ పుష్పాలతో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్, టీడీపీ మండల అధ్యక్షుడు పెదిరెడ్డి చిట్టిబాబు, నాయకులు యాళ్ల సన్నబాబు, యాళ్ల వరహాలు, పెదిరెడ్డి నాగేశ్వరరావు, చిక్కాల శ్రీనివాసరావు తదితరులు స్వామిని దర్శించుకున్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

పాయకరావుపేట, మార్చి 7 : పెద్దాపురం-పాయకరావుపేట 132 కేవీ విద్యుత్ ఉప కేంద్రంలో ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈనెల 9, 10వ తేదీల్లో పాయకరావుపేట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడడంతోపాటు వ్యవసాయ విద్యుత్ సరఫరాల్లో మార్పులు చేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఎల్.మహేంద్రనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. కొరుప్రోలు, ఎస్.రాయవరం, పి.ధర్మవరం, పెదగుమ్ములూరు, దార్లపూడి, ఉపమాక, వేంపాడు, గొడిచెర్ల, పాయకరావుపేట, సత్యవరం, శ్రీరాంపురం, పాల్మన్‌పేట, నరసింగబిల్లి, నర్సీపట్నం పరిధిలోని వ్యవసాయానికి తెల్లవారుజామున 4గంటల నుంచి ఇవ్వబడుతుందన్నారు.

జనసేనలో చేరిన కోరిబిల్లి పరమేశ్ బృందం



పరమేశ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన కొణతాల

అనకాపల్లి టౌన్, మార్చి 7 : స్థానిక సర్వేజన ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు కోరిబిల్లి పరమేశ్ గురువారం జనసేన పార్టీలో చేరారు. అనకాపల్లి నియోజకవర్గ టీడీపీ-జనసేన ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ సమక్షంలో పరమేశ్, అతనితోపాటు మరో కొంతమంది పార్టీలోకి చేరారు. వీరికి కొణతాల పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

వైభవంగా కనకదుర్గమ్మ పండగ


అమ్మవారిని దర్శించుకుంటున్న బండారు సత్యనారాయణమూర్తి

సబ్బవరం, మార్చి 7: మండలంలోని పైడివాడఅగ్రహారంలో గురువారం కనకదుర్గమ్మ అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. అమ్మవారిని మాజీమంత్రి బండారు సత్యనారాయణమూర్తి దర్శించుకొని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు శీరం అప్పలరాజు, అక్కిరెడ్డి రామలక్ష్మి, కన్నారావు, దుర్గినాయుడు, ఎం.మహాలక్ష్మీనాయుడు, రొంగలి దేముడు, సత్యనారాయణ, చిన్నంనాయుడు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన గెలుపు చారిత్రక అవసరం : పీలా


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద

తుమ్మపాల, మార్చి 7 : టీడీపీ-జనసేన పార్టీ గెలుపు చారిత్రాత్మక అవసరమని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్‌ను టీడీపీ , జనసేన శ్రేణులు ప్రజలకు వివరించాలన్నారు. టీడీపీ అధికారం చేపట్టిన వెంటనే బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామన్నారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అవ్వడమే లక్ష్యంగా కార్యకర్తలంతా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు కాయల మురళీ, కర్రి బాబి, బీఎస్ఎంకే జోగినాయుడు, పెంటకోట రాము పాల్గొన్నారు.

'తప్పనిసరైతే పోలింగ్ బూత్‌ను మార్చాలి'

అనకాపల్లి కలెక్టరేట్, మార్చి 7 : జిల్లాలో పోలింగ్ కేంద్రాల మార్పు తప్పనిసరి పరిస్థితుల్లోనే చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో తహసీల్దార్లు,రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవనం పూర్తిగా పాడైనప్పుడే పోలింగ్ కేంద్రం పేరు మార్పు చేయవచ్చునన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ బి. స్మరణ్‌రాజ్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

'జనసేనపై కక్ష సాధింపు మానుకోవాలి'

పాయకరావుపేట/నక్కపల్లి, మార్చి 7 : జనసేన పార్టీపై పోలీసులు కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోడపాటి శివదత్ అన్నారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మంగళగిరిలో జనసేన పార్టీకి పనిచేసే సిబ్బంది ప్లాట్‌లో పోలీసులు సోదాలు చేయడం కక్ష సాధింపు చర్య అన్నారు. పవన్‌కల్యాణ్ వ్యక్తిగత భద్రతా సిబ్బంది, పార్టీ మీడియా సిబ్బంది గదుల్లో అర్ధరాత్రి సోదాలు ఎవరి ప్రోద్బలంతో చేశారో చెప్పాలని ప్రశ్నించారు. ఇటువంటి చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని శివదత్ అన్నారు.
























నర్సీపట్నం
నియోజకవర్గం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నర్సీపట్నం, మార్చి 7 : పెదబొడ్డేపల్లి 32/11 కేవీ సబ్ స్టేషన్ రెండో ఫీడర్ పరిధిలోని లైన్ మరమ్మతుల కారణంగా శుక్రవారం డాన్‌బాస్కో కళాశాల, నర్సీపట్నం కొత్త వీధి, బీసీ, ఎస్సీ కాలనీలు, అయ్యన్న కాలనీ, కోర్టు సముదాయంలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏపీఈపీడీసీఎల్ డీఈఈ సత్యానందం తెలిపారు.









శివ పూజకు వేళాయె..

- మహా శివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు ముస్తాబు
- భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు
- వేకువజాము నుంచి పూజలు




సుందరంగా తీర్చిదిద్దిన బలిఘట్టం బ్రహ్మలింగేశ్వర ఆలయం.., భక్తుల పూజలు అందుకోనున్న స్వామి

నర్సీపట్నం, మార్చి 7 : మహా శివరాత్రి ఉత్సవాలకు నియోజకవర్గంలోని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా నర్సీపట్నంలోని బలిఘట్టంలో బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయాన్ని దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేవతలచే ఈ ఆలయం నిర్మించబడినదని భక్తుల ప్రగాఢ నమ్మకం. పూర్వం బలిచక్రవర్తి లోక కల్యాణార్థం యజ్ఞం చేయదల్చి శివారాధనకు బ్రహ్మదేవుని కోసం తపస్సు చేశారని, అప్పుడు బ్రహ్మ ప్రత్యక్షమై ఇక్కడ త్రిశూల పర్వతశ్రేణిపై శివలింగాన్ని ప్రతిష్ఠించారని పురాణాలు చెబుతున్నాయి. అందువల్లే బహ్మలింగేశ్వరస్వామి అని పేరు సార్థకమైందని అంటున్నారు. మహాశివరాత్రికి నర్సీపట్నం చుట్టు పక్కల ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వస్తుంటారు. ఉత్తరవాహినిలో పుణ్యస్నానాలు చేసిన అనంతరం స్వామివారిని దర్శించుకుంటారు. ఈ ఏడాది కొండపైకి వచ్చిన తర్వాత గుడి మెట్లు పక్కన బైక్ పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయంలో క్యూ లైన్లు, భక్తుల కోసం అన్నప్రసాద వితరణకు కౌంటర్లు, తాగునీరు వంటి వాటని ఏర్పాటు చేసినట్టు చైర్మన్ శెట్టి చినబాబు తెలిపారు.




గొలుగొండ మండలం ధారమఠంలోని ఆలయం (అంతర్ చిత్రం) ఉమా ధారమల్లేశ్వస్వామివారు

ధారమఠంలో మూడు రోజుల వేడుకలకు సర్వం సిద్ధం

గొలుగొండ, మార్చి 7 : మహా శివరాత్రి సందర్భంగా మండలంలోని పాతమల్లంపేటలో గల ఉమాధారమల్లేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. శుక్రవారం నుంచి మూడు రోజుల పాటు ఇక్కడ ఈ వేడుకలు జరగనున్నాయి. భారీ సంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో దేవదాయ శాఖ అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేపట్టారు. నర్సీపట్నం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. ఇదిలావుంటే, ధారమఠం ఆలయంతో పాటు పరిసరాలను నర్సీపట్నం డీఎస్పీ మోహన్ గురువారం పరిశీలించారు. భక్తులకు కల్పిస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం అధికారులతో పాటు ఆలయ కమిటీ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు. రూరల్ సీఐ హరి, గొలుగొండ ఎస్ఐ కృష్ణారావు ఆయన వెంట ఉన్నారు.

రాష్ట్రానికి చంద్రబాబుతోనే భవిష్యత్తు

- జగన్ అరాచక పాలనకు స్వస్తిపలకండి
- కొంగసింగి ఎన్నికల శంఖారావం సభలో విజయ్ పిలుపు



కొంగసింగి సభలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి విజయ్

కృష్ణాదేవిపేట, మార్చి 7 : ముఖ్యమంత్రి జగన్‌ను గద్దెదించడమే లక్ష్యంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. గొలుగొండ మండలం కొంగసింగిలో గురువారం రాత్రి నిర్వహించిన ఎన్నికల శంఖారావం సభలో మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలన సాగిస్తోందన్నారు. జగన్ నియంతలా వ్యవహరిస్తూ రాజధాని లేని రాష్ట్రంగా చేయడంతో పాటు దోచుకోవడం, దాచుకోవడమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఓటును ఆయుధంగా చేసుకుని ఈ రాక్షస పాలనకు స్వస్తి పలకాలన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితే, జగన్ పాలనలో అధోగతి పాలైందని వాపోయారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్రానికి చంద్రబాబు వంటి సమర్థ నాయకత్వం అవసరమన్నారు. ప్రజలంతా టీడీపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, మాజీ జడ్పీటీసీ చిటికెల తారకవేణుగోపాల్, గ్రామ సర్పంచ్ యలమంచిలి నూకరత్నం, చోద్యం సర్పంచ్ అదపురెడ్డి గోపాలకృష్ణ, ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ, టీడీపీ నాయకులు యలమంచిలి వరహాలబాబు, మల్లేష్, సత్తిబాబు, కొలగాని రామారావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రశాంతంగా టెన్త్ పరీక్షలు రాయండి'



వేడుకల్లో డ్యాన్స్‌లతో అలరిస్తున్న విద్యార్థినులు

మాకవరపాలెం, మార్చి 7 : ఇక్కడి జడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం ఫేర్‌వెల్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు ఎంఈవో మూర్తి దిశానిర్దేశం చేశారు. ఎటువంటి ఒత్తిడికి గురికాకుండా పరీక్షలను చక్కగా రాసి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థినీ విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. ప్రధానోపాధ్యాయుడు అచ్యుతరామయ్యతో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తూటిపాలలో మహిళా దినోత్సవం



పాఠశాలలో కార్మికులను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

మాకవరపాలెం, మార్చి 7 : తూటిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు కోడూరు లక్ష్మి, శీరంరెడ్డి వరలహాలమ్మ, పారిశుధ్య కార్మికురాలు మన్నేటి చిన్నతల్లిలను ప్రధానోపాధ్యాయుడు రాము సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

సాగు భూములపై గిరిజనులకు హక్కు కల్పించాలి

గొలుగొండ, మార్చి 7 : మైదాన ప్రాంత గిరిజనులు ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములపై వారికి హక్కు కల్పించాలని సీపీఎం నాయకులు అడిగర్ల రాజు, ఈర్లె చిరంజీవి తదితరులు డిమాండ్ చేశారు. మండలంలోని బుడ్డపాడు గ్రామంలో గురువారం వారు పర్యటించి మాట్లాడారు. వసతి గృహంలో గ్రామానికి చెందిన విద్యార్థి విద్యుత్ షాక్‌తో మృతిచెందిన సందర్భంగా ఇక్కడికి విచ్చేసిన ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ శంకరరావుకు స్థానిక గిరిజనులు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారన్నారు. దానిపై ఆయన ఈ సమస్యలు పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించినా నేటికీ కార్యరూపం దాల్చలేదని వాపోయారు.

బాక్సింగ్‌లో నర్సీపట్నం బాలికలకు పతకాలు



విజేతలకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న చైర్మన్ నారాయణరావు

నర్సీపట్నం, మార్చి 7 : విశాఖలోని గోపాలపట్నంలో మూడు రోజులపాటు జరిగిన సబ్ జూనియర్స్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన కె.శరణ్య, కె.హర్షిత కాంస్య పతకాలు సాధించినట్టు కోచ్ యర్రా శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా నింజాస్ అకాడమీ చైర్మన్ వెలగా నారాయణరావు గురువారం ఇక్కడ విజేతలను అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండండి

- ఏఎంవో సత్యనారాయణ

దేవరాపల్లి, మార్చి 7: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.సత్యనారాయణ అన్నారు. గురువారం వినకోట పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవి గదిలో రికార్డులు తనిఖీ చేశారు. అనంతరం సిబ్బంది వైద్యాధికారులతో సమావేశమయ్యారు. క్షేత్రస్థాయిలో రక్తపూతలు ఎక్కువగా సేకరించడం వలన మలేరియా వంటి వ్యాధులను గుర్తించవచ్చన్నారు. దోమతెరలు వాడడం దోమలు చేరే ప్రదేశాలను గుర్తించి వాటిని తొలగించాలన్నారు. ఇండోర్ స్ప్రేయింగ్ విధిగా చేయించాలన్నారు. వైద్యాధికారులు జి.వెంకటేష్, డి.రూప్‌చంద్, పర్యవేక్షకులు రవి, సావిత్రి, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీదేవీ, పార్మసిస్ట్ అశ్విని, స్టాఫ్‌నర్సు విజయ తదితర సిబ్బంది పాల్గొన్నారు.







చోడవరం
నియోజకవర్గం

సీఎం సభతో మండల సమావేశం వాయిదా

చోడవరం, మార్చి7: సీఎం జగన్ పర్యటన కారణంగా గురువారం నిర్వహించవలసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని అధికారులు వాయిదా వేశారు. గురువారం జరగవలసిన సమావేశాన్ని ఈనెల 11వ తేదీకి వాయిదావేశారు. సభ్యులు ఈ విషయాన్ని గమనించి, సమావేశానికి హాజరుకావాలని ఎండీవో కె. రమామణి తెలిపారు.

ఘనంగా వడ్డాది పాఠశాల వార్షికోత్సవం

బుచ్చెయ్యపేట, మార్చి 7: మండలంలోని వడ్డాది మెయిన్ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతి ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. విద్యార్థులకు హెచ్‌ఎం శేషగిరిరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ వెలుగుల నాగేశ్వరరావు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టీచర్లు రామలక్ష్మి, సత్యనారాయణ పాల్గొన్నారు.

త్వరలో విశాఖలో షర్మిల పర్యటన

కె.కోటపాడు, మార్చి 7: విశాఖలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల పర్యటన త్వరలో ఉంటుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వడ్డాది కోటేశ్వరరావు అన్నారు. గురువారం ఇక్కడ జరిగిన పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ పర్యటనకు మాడుగుల నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ కొండ్రపు గోపి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రొంగలి నాయుడుబాబు, డీసీసీ సెక్రటరీ వంటాకు అప్పారావు, గండి శంకరరావు పాల్గొన్నారు.

ఎం.అమండలో గడ్డి వాము దగ్ధం

దేవరాపల్లి, మార్చి 7: మండలంలోని ఎం.అమండలో పోతల వారి కళ్లాల్లో గురువారం మధ్యాహ్నం జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. విద్యుత్ తీగలు తగలడంతో షార్టు సర్క్యూట్ అయి ప్రమాదం జరిగిందని రైతు పోతల గోవింద విలేకరులకు తెలిపారు. తామే మంటలను అదుపు చేసుకున్నామన్నారు.

ఈవీఎంలపై ప్రజలకు అవగాహన

రోలుగుంట, మార్చి 7 : మండలంలోని బుచ్చెంపేటలో గురువారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల(ఈవీఎం)పై ప్రజలకు రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు. తహసీల్దార్ రవిచంద్ర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమంలో సిబ్బంది ఈవీఎం ఓటింగ్‌పై అవగాహన కల్పించారు. అనంతరం మాక్ పోలింగ్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పోతురాజుబాబు జాతర

రోలుగుంట, మార్చి 7: మండలంలోని శరభవరం, వైబీపట్నం, బీబీపట్నం, పనుకులపాలెం గ్రామాల్లో పోతురాజుబాబు జాతర గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆలయాల వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పోతురాజుబాబుని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

సందడిగా హైస్కూల్ విద్యార్థుల వీడ్కోలు

కె.కోటపాడు, మార్చి 7 : స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమం ఆటపాటలతో సందడిగా ముగిసింది. పలువురు విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంతో నృత్యాలు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో సత్యనారాయణ మాట్లాడుతూ.. రాబోయే పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఎంపీటీసీ సభ్యురాలు బంగారు లక్ష్మి, పాఠశాల తల్లిదండ్రులు కమిటీ చైర్మన్ బోకం వెంకట సత్యనారాయణ, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హాట్‌కేక్‌లా చింతపండు విక్రయం

కోనాం సంతలో కిలో రూ.45 నుంచి రూ.50 కొనుగోలు

చీడికాడ, మార్చి 7: మండలంలోని కోనాం సంతకు గురువారం వచ్చిన చింతపండు హాట్‌కేక్‌లా అమ్ముడుపోయింది. కోనాం పంచాయతీ గిరిజన గ్రామాలతోపాటు పాడేరు, హుకుంపేట, అనంతగిరి మండలాల నుంచి ఉదయం 8గంటలకే చింతపండు వచ్చింది. గత వారం రూ.30 నుంచి రూ.35 ధర ఉండగా.. ఈ వారం కొనుగోలుదార్లు అధిక సంఖ్యలో తరలిరావడంతో కిలో రూ.45 నుంచి రూ.50 వరకు అమ్ముడుపోయింది. ఉదయం 11గంటలకే చింతపండు అమ్మకాలు చేశారు. ధర పలకడంతో గిరిజనులు వారానికి సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి స్వగ్రామాలకు వెళ్లిపోయారు.



కోనాం సంతలో చింతపండు కొనుగోలు చేస్తున్న మహిళ

మాడుగుల
నియోజకవర్గం

టీడీపీ పాలనలోనే బీసీలకు మేలు

- పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దేముడు

మాడుగుల రూరల్, మార్చి 7: తెలుగుదేశం పాలనలోనే బీసీలకు సముచితస్థానం లభించిందని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఉండూరు దేముడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టీడీపీ-జనసేన ఉమ్మడిగా ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై బీసీ వర్గాలు ఎంతో హర్షం వ్యక్తం చేస్తున్నాయన్నారు. టీడీపీ హయాంలో ఆదరణ పథకం ద్వారా చేతివృత్తులు, కులవృత్తులకు పరికరాలు అందించి వారి జీవితాలకు బాట వేశారని గుర్తు చేశారు. బీసీలకు 50ఏళ్లు దాటిని వ్యక్తికి రూ4వేలు పింఛను ఇస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు

మహాశివరాత్రికి శివాలయాలు ముస్తాబు



ఎం.కోడూరులో శివాలయానికి రంగులు వేసిన దృశ్యం



కె.కోటపాడులోని భ్రమరాంబిక మల్లికార్జున ఆలయం

మాడుగుల రూరల్, మార్చి 7: మహాశివరాత్రికి మండలంలోని పలు గ్రామాల్లో గల శివాలయాలు సిద్ధమయ్యాయి. శివాలయాలకు రంగులు వేయించారు. విద్యుద్దీపాలంకరణ చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీడ కోసం టెంట్లు, తాగునీరు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఎం.కోడూరు, జంపెన , వీరవిల్లి అగ్రహారం, జాలంపల్లి, పిట్టగెడ్డ, కేజేపురం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో గురువారం వేకువజాము నుంచి పాలాభిషేకాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నారు.

కె.కోటపాడులో..

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భ్రమరాంబిక మల్లికార్జునేశ్వర దేవస్థానం ముస్తాబైంది. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. శుక్రవారం ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. అలాగే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు తలెత్తకుండా నిర్వాహకులు తగు చర్యలు చేపట్టామని తెలిపారు.

దేవరాపల్లిలో..

మండల కేంద్రంలోని బీరక వీధిలో ఉన్న పోతులూరి వీరబ్రహ్మం ఆలయంలో కల్యాణ మహోత్సవాలు శుక్రవారం జరగనున్నాయి. మండలంలోని పలు గ్రామాల్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. భక్తుల దర్శనాలకు అన్ని ఏర్పాట్లను ఆలయ కమిటీలు పూర్తి చేశాయి.

సెంటిమెంట్‌తో ప్రారంభమైన బూడి ఎన్నికల ప్రచారం

దేవరాపల్లి, మార్చి7: ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడుకు మాడుగుల వైసీపీ అభ్యర్థిగా టికెట్ కేటాయించడంతో గురువారం దేవరాపల్లి సన్యాసమ్మ గ్రామదేవత ఆలయంలో బూడి భార్య రమణమ్మ పూజలు చేశారు. అనంతరం గ్రామంలోని వెత్సా కృష్ణ, నరసింగరావు కుటుంబాల ఇళ్ల నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, జెడ్పీటీసీ సభ్యుడు కర్రి సత్యం, కిలపర్తి భాస్కరరావు, సింహాచలంనాయుడు, మొల్లి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



సన్యాసమ్మ దేవతకు పూజలు చేస్తున్న ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం

చోడవరం, మార్చి7: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రతిభావంతులైె విద్యార్థినీ విద్యార్థుల తల్లులకు కళాశాల ఎంపవర్ కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ కిరణ్, డాక్టర్ విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ పీవోలు రత్నభారతి, మాల్యాద్రి, సత్యవతి, సూర్యవతి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి



